# సాక్షి అన్నమయ్య జిల్లా

గురువారం | 4 | జనవరి | 2024






**రేణిగుంట వరకు నంద్యాల డెమో!**

ఉదయం నుంచి సాయంత్రం వరకు వృథాగా ఉండే నంద్యాల-కడప మధ్య నడిచే డెమో ప్యాసింజర్ రైలు కడప రైల్వేస్టేషన్‌ను వదలింది. బుధవారం రైల్వేశాఖ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. - 8లో



**క్రీడలతో మానసికోల్లాసం**

విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని జిల్లా ఎస్పీ కృష్ణారావు అన్నారు. కొత్తగా నిర్మించిన మైదానంలో క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. - 8లో

**మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)**

| | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| మొదటిరకం | రూ.190 | రూ.260 |
| రెండోరకం | రూ.100 | రూ.186 |

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 113 మెట్రిక్ టన్నులు



# సామాజిక విజయం





సభకు హాజరైన జనసందోహంలో ఒక భాగం (ఇన్‌సెట్) బస్సు యాత్రలో ప్రజలకు అభివాదం తెలుపుతున్న ప్రభుత్వవిప్ కొరముట్ల, ప్రముఖ నటుడు ఆలీ

- భారీ జనసందోహం నడుమ సామాజిక సాధికార బస్సు యాత్ర
- డప్పు వాయిద్యాలు, కోలాటాల మధ్య సాగిన యాత్ర
- ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల విజయ సంకేతాలు
- ఐదు మండలాల ప్రజలతో కిటకిటలాడిన కోడూరు

**రైల్వేకోడూరు/రైల్వేకోడూరు అర్బన్ :** రైల్వేకోడూరు పట్టణంలో బుధవారం జరిగిన సామాజిక సాధికారిక బస్సు యాత్ర విజయవంతమైంది. జనసందోహంతో కోడూరు పట్టణం కిటకిటలాడింది. సభకు ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. బస్సు యాత్ర, భారీ బహిరంగ సభ , మేధావులతో సమ్మేళనం కార్యక్రమాలు విజయవంతంగా జరిగాయి. మధ్యాహ్నం స్థానిక రాజ్ రెసిడెన్సీ నుంచి టోల్‌గేట్ వరకు ఐదు మండలాల ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ నియోజకవర్గ కార్యకర్తలు, ప్రజల నడుమ సుమారు నాలుగుగంటల సేపు కొనసాగింది. బస్సు యాత్రకు ప్రజలు అడుగడుగునా జేజేలు పలికారు. దారిపొడవునా కేరళ వాయిద్యాలు, పండరీ భజనలు, ఆర్కెస్ట్రాలతో పాటు భారీ ఎత్తున బాణసంచా కాలుస్తూ టోల్‌గేట్ సభా ప్రాంగణం వరకు యాత్ర కొనసాగింది. ఎన్టీఆర్ సర్కిల్, మార్కెట్ సర్కిల్, టోల్‌గేట్ వద్ద నాయకులు బస్సు యాత్రకు క్రేన్‌ల సహాయంతో గజమాలలు ఏర్పాటు చేసి స్వాగతం పలికారు. జగనన్న డీజే పాటలతో యువకులు హోరెత్తిపోయారు. టోల్‌గేట్ వద్ద వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి నివాళర్పించి వేలాదిమంది నియోజకవర్గ ప్రజల నడుమ సామాజిక సాధికార సభను నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీ నందిగామ సురేష్, ప్రముఖ నటుడు ఆలీ, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, మేయర్ సురేష్‌బాబు, జెడ్పీ చైర్మన్ అమర్‌నాథ్‌రెడ్డి, సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి హాజరయ్యారు.

## సామాజిక సాధికారతను చేతల్లో చూపిన సీఎం



28 రాష్ట్రాలలో 78 సంవత్సరాలు ఎందరో ముఖ్య మంత్రులు పరిపాలించారు, అందరూ సాధికారత గురించి మాట్లాడేవారే కానీ ఎవరూ పాటించలేదు. దేశంలో సామాజిక సాదికారకత పాటించి చూపించిన ఏకైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే. ప్రతి ఒక్కరూ ఓట్లకోసం, సీట్లకోసం వాడుకునే వారే కాని ఏనాడు అమలు చేయలేదు. ఐదు ఉప ముఖ్యమంత్రులు, హోంమంత్రి, ఎన్నో కార్పొరేషన్ చైర్మన్‌లు, డైరెక్టర్‌లు పదవులు ఇచ్చి పరిపాలించే స్థాయికి తీసుకువచ్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే. రాబోయే ఎన్నికలలో మనమంతా జగన్‌మోహన్‌రెడ్డి వెంట నడవాల్సిన బాధ్యత ఉంది.

– సురేష్‌బాబు, కడప మేయర్

## సీఎం పాలన దేశానికే ఆదర్శం

– ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

**రైల్వేకోడూరు/రైల్వేకోడూరు అర్బన్ :** సామాజిక బాధ్యతతో పరిపాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి దేశంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే అని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. బుధవారం రైల్వేకోడూరు రాజ్ రెసిడెన్స్‌లో జరిగిన మేధావులు, డాక్టర్లు, లాయర్లు సమ్మేళనంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో అధికారం చేపట్టాక కులమత వర్గ విభేదాలు లేకుండా పరిపాలన సాగించారన్నారు. ఈ సమావేశంలో ప్రముఖ వైద్యులు వెంగల్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన నాడు-నేడు పథకంలో విలేజ్‌క్లీనిక్‌లు సామాజిక ఆరోగ్య కేంద్రాల అభివృద్ధి దేశంలోనే ఆదర్శం అన్నారు. ప్రజా ఆరోగ్యం పట్ల ఆయన చూపుతున్న శ్రద్ధ అమోఘం అని ఆయన పేర్కొన్నారు. ప్రముఖ న్యాయవాది ఆర్‌సీ సురేష్‌బాబు మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా ప్రతి వర్గాన్ని ఆదరిస్తూ చట్టపరంగా ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తూ పరిపాలన చేయడం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమయిందన్నారు. అతి సామాన్యుడు కూడా చట్టాలగురించి, న్యాయాల గురించి పోలీస్‌స్టేషన్‌లకు వెళ్లకుండానే ఫిర్యాదులు చేసే వెసులుబాటు ప్రజా పరిపాలనలో రావడం ఎంతో శ్రేయస్కరం అయిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నటుడు ఆలీ, రామసుబ్బారెడ్డి, అడ్వకేట్ మధుసూదన్, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, డీఏబీ చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ముప్పాల హేమనవర్మ, చెవ్వు శ్రీనివాసులరెడ్డి, వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి, సిహెచ్.రమేష్ పాల్గొన్నారు.



మేధావుల సదస్సులో మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

## సామాజిక న్యాయం పాటించిన ఏకైక సీఎం జగన్

– ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు



తన రాజకీయ జీవితంలో ఐదుగురు ముఖ్యమంత్రులను చూశానని, ఏ ముఖ్యమంత్రి పాటించని సామాజిక న్యాయం పాటించి చూపించిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. 70 ఏళ్లుగా రాష్ట్రాన్ని ఎన్నో పార్టీలు , ఎందరో ముఖ్యమంత్రులు పరిపాలించారని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టాక ఎస్సీ,ఎస్టీ, బీసీ మైనార్టీల కష్టాలు తెలుసుకుని ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి వారి అభ్యున్నతికి కృషి చేశారని కొనియాడారు. రాష్ట్రంలో పరిపాలన ఎంతో అద్భుతంగా సాగుతోందన్నారు. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా నవరత్నాలతో పాటు మరెన్నో పథకాలు ప్రవేశపెట్టి అమలు చేశారన్నారు. ప్రతి ఇంటికి పథకాలు తలుపు తట్టి మరీ అందిస్తున్న ఘనత మన జగనన్నకే సాధ్యమన్నారు. గత ప్రభుత్వాలు ముఖ్యమంత్రులు నేటి నాలుగున్నర సంవత్సర జగనన్న పరిపాలనలో తేడా ప్రజలు గమనించాలన్నారు. నాలుగు దఫాలు తనను ఎమ్మెల్యేగా కోడూరు ప్రజలు గెలిపించారని , ముఖ్యమంత్రి జగనన్న సహకారంతో తాను చేసిన అభివృద్ధిని చూడాలన్నారు. మన ప్రభుత్వం ఏర్పడ్డాక కోడూరు నియోజకవర్గంలో రూ.1600 కోట్లు అభివృద్ధి పనులకు వెచ్చించామని వెల్లడించారు. ఇంకా సంక్షేమం అభివృద్ధి చేసి కోడూరు ప్రజల రుణం తీర్చుకోవడానికి జగనన్నకు, తనకు అవకాశం ఇవ్వాలన్నారు.



కోలాటం ఆడుతున్న కళాకారులు

## న్యూస్‌రీల్

### నేడు వైద్యులకు ఒక రోజు శిక్షణ



జిల్లా వైద్యాధికారి ఎస్. కొండయ్య

**రాయచోటి టౌన్ :** జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులలో పని చేస్తున్న వైద్యులకు అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో ఉన్న శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఒక రోజు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎస్. కొండయ్య తెలిపారు. ఈ శిక్షణ తరగతులు శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలోని సెమినార్ హాల్లో నిర్వహిస్తామని తెలిపారు. ఈ శిక్షణ తరగతులలో కలెక్టర్, జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, జిల్లా విద్యాధికారి, జిల్లా పంచాయతీ రాజ్ అధికారి, రూరల్ డెవలప్‌మెంట్ అండ్ ఉమెన్ డెవలెప్మెంట్ అధికారి, ఐఎంఏ ప్రెసిడెంట్,ఎన్‌జీఓలు, మహిళ సమాఖ్య జిల్లా ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారులు తదితరులు పాల్గొంటారని తెలిపారు.

### డీలర్లు సమయం పాటించాలి

**గుర్రంకొండ :** రేషన్ దుకాణాల్లో డీలర్లు సమయపాలన పాటించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అన్నారు. బుధవారం మండలంలోని గుర్రంకొండ, యల్లంపల్లె చౌక దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. నిత్యావసర సరుకుల సరఫరా వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన నిత్యావసర సరుకుల పంపిణీ విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. గుర్రంకొండలోని కొన్ని దుకాణాలు ఉదయం 9 గంటలకు కూడా తెరవడం లేదని ఫిర్యాదులు అందాయని తెలిపారు. సకాలంలో నిత్యావసర సరుకులు అందించాలని ఆదేశించారు. వస్తువుల పంపిణీలో అవతవకలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి రఘురాం, తహశీల్దార్ ఖాజాబీ, సివిల్ డీటీ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

### బీఎల్‌ఓ సస్పెన్షన్

**చిట్వేలి :** చిట్వేలి మండలం, నాగవరం వడ్డిపల్లి పోలింగ్ కేంద్రం 39 బీఎల్ఓ చిట్టిపిరెడ్డి గంగాధర్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేసినట్లు తహశీల్దార్ శిరీషా బుధవారం తెలిపారు. గంగాధర్ నాగవరం సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ నాగవరం బీఎల్‌ఓగా విధులు నిర్వహిస్తున్నాడు. ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి నివేదిక 127 రైల్వేకోడూరు (ఎస్సీ) అసెంబ్లీ నియోజకవర్గం వారి ఆదేశానుసారం సస్పెండ్ ఉత్తర్వులు వచ్చినట్లు సమాచారం.

### 5న జాబ్‌మేళా

**కడప కోటిరెడ్డిసర్కిల్ :** జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈనెల 5న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ఇంటర్వ్యూలు మొదలవుతాయని వివరించారు.

## మదనపల్లె పట్టు చీరకు జాతీయ గుర్తింపు

**మదనపల్లె :** స్థానిక కళాకారుల కళలను ప్రోత్సహించేందుకు, తమ కళలకు మార్కెట్‌ను సృష్టించేందుకు కేంద్రప్రభుత్వ సంస్థ మినిస్ట్రీ ఆఫ్ కామర్స్ ప్రవేశపెట్టిన వన్ డిస్ట్రిక్ట్ - వన్ ప్రోడక్ట్( ఒక జిల్లా- ఒక ఉత్పత్తి) కింద అన్నమయ్య జిల్లా నుంచి మదనపల్లె చేనేత పట్టుచీర ఎంపికైంది. గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మినిస్ట్రీ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో వన్ డిస్ట్రిక్ట్-వన్ ప్రోడక్ట్(ఓడీఓపీ) పథకంలో భాగంగా దేశవ్యాప్తంగా ఒక్కో జిల్లా నుంచి ఒక ఉత్పత్తిని గుర్తించి..ఆ ఉత్పత్తి విశిష్టతను ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాతి పొందేందుకు, ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంది. అందులోభాగంగా అన్నమయ్య జిల్లా నుంచి మదనపల్లె చేనేత పట్టుచీరలను జిల్లా కలెక్టర్ గిరీషా.పీఎస్. నిర్ణయం మేరకు ఓడీఓపీ ఉత్పత్తిగా ఎంపిక చేసి నామినేషన్లకు గత ఏడాది జూలైలో దరఖాస్తు చేశారు. అందులో భాగంగా నామినేషన్ల పరిశీలనకు 2023 అక్టోబర్‌లో కేంద్రప్రభుత్వం నుంచి వచ్చిన ప్రతినిధి బృందం మదనపల్లె పట్టుచీరలకు సంబంధించి నామినేషన్‌లో పేర్కొన్న అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వెళ్లారు. ఈ నేపథ్యంలో ఓడీఓపీ కింద దేశవ్యాప్తంగా పది జిల్లాస్థాయి అవార్డులు, ఎనిమిది రాష్ట్రస్థాయి, అంతర్జాతీయ స్థాయి సంస్థలకు ఆరు అవార్డులు ప్రదానం చేశారు. వీటిలో అన్నమయ్య జిల్లాకు అవార్డు దక్కింది. బుధవారం న్యూఢిల్లీ ప్రగతిమైదానంలోని భారత్‌భవనంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్‌గోయల్, కేంద్రవిదేశాంగ శాఖ మంత్రి జయశంకర్ చేతులమీదుగా ప్రతిష్టాత్మక ఓడీఓపీ అవార్డును జిల్లా కలెక్టర్ గిరీషా తరపున జిల్లా చేనేత, జౌలిశాఖ అధికారి పి.శ్రీనివాసులురెడ్డి అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పీఎస్.గిరీషా మాట్లాడుతూ.. అవార్డుతో జిల్లాలోని చేనేత ఉత్పత్తి అయిన మదనపల్లె పట్టుచీరల ఖ్యాతి ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి పొందడంతో పాటు, ఉత్పత్తికి మార్కెటింగ్ సదుపాయం మెరుగవుతుందన్నారు. తద్వారా చేనేత కార్మికులకు మెరుగైన జీవనోపాధులు లభిస్తాయన్నారు.



ఓడీఓపీ అవార్డును అందుకుంటున్న చేనేత, జౌలిశాఖ ఏడీ శ్రీనివాసులురెడ్డి

## ఏఎఫ్‌యూ సెమిస్టర్ పరీక్షా ఫలితాలు విడుదల

**ఏఎఫ్‌యూ :** కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో కాలేజ్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్, స్కూల్ ఆఫ్ ప్లానింగ్‌కు సంబంధించిన 3వ, 7వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫలితాలను వీసీ ఆచార్య బి. ఆంజనేయప్రసాద్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ 3వ సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో 95 శాతం మంది, 7వ సెమిస్టర్‌లో 97 శాతం మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. పరీక్షా ఫలితాలను కళాశాల వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. తక్కువ సమయంలోనే పరీక్షా ఫలితాలను విడుదల చేసేందుకు కృషి చేసిన పరీక్షల విభాగాన్ని అభినందించారు. డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్, సూపరింటెండెంట్ పవన్‌కుమార్‌రెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఇ.సి. సుప్రియ, సహాయ అధికారులు ఉదయ్‌ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.



పరీక్షా ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ ఆంజనేయప్రసాద్, పరీక్షల విభాగం అధికారులు

## అమ్మో.. పులి

**చక్రాయపేట :** మండలంలోని సురభి గ్రామం పాయలోపల్లె వద్ద బుధవారం చిరుత కనిపించడంతో గ్రామస్తులు భయంతో పరుగులు తీశారు. విషయం తెలియగానే మామిడి తోటల్లో ఉన్న రైతులు సైతం పరుగులు తీస్తూ ఇళ్లకు చేరారు. ప్రత్యక్షంగా చూచిన శంకర్, మహేశ్వర్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఉదయం దొంగమూల ప్రాంతంలో ఉన్న అడవికి పాడి పశువులను మేత కోసం తోలు కెళుతుండగా ఎదురు వైపు నుంచి చిరుత రావడం గుర్తించామని చెప్పారు. వెంటనే గట్టిగా కేకలు వేస్తుండగా చిరుతను చూచిన పశువులు బెదిరి వెనకకు పరుగులు తీశాయన్నారు.వెటనే తాము గ్రామస్థులకు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వగానే అందరూ వచ్చి పెద్ద ఎత్తున టపాకాయలు కాలుస్తూ గట్టిగా కేకలు వేయడంతో చిరుత అడవిలోకి వెళ్లి పోయిందని చెప్పారు. నెల రోజులుగా చిరుత ఈ ప్రాంతంలోనే సంచ రిస్తోందన్నారు. ఊరికి కిలోమీటరు దూరంలోనే చిరుత కనిపించడంతో గ్రామస్థులు భయాందోళనలకు గురవుతున్నారు.ఊరు చుట్టూ పెద్ద పెద్ద మామిడి తోటలు ఉన్నాయని ఒంటరిగా తోటల్లోకి వెళ్లాలంటే కూడా భయమేస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అటవీ శాఖ అధికారులు స్పందించి చిరుతను పట్టుకోవాలని పాయలోపల్లె వాసులు కోరుతున్నారు.



దొంగమూల ప్రాంతంలో బుధవారం కనిపించిన చిరుత కాలి గుర్తులు

## పేదల సంక్షేమానికి ప్రాధాన్యత

- జిల్లాలో 1,88,272 మందికి రూ.3 వేలకు పింఛన్ల పెంపు
- కొత్తగా 3210 మందికి పింఛన్ల మంజూరు
- జిల్లాలో మొత్తంగా 2,26,790 మందికి రూ.67.31 కోట్ల పింఛన్ల లబ్ధి
- జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్



లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న జేసీ, మున్సిపల్ చైర్మన్లు

**రాయచోటి :** పేద ప్రజల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. పెంచిన పెన్షన్ల లబ్ధిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి వర్చువల్ విధానంలో లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ఇందులో భాగంగా అన్నమయ్య జిల్లాలోని 3210 మందికి కొత్తగా మంజూరైన పింఛన్లతో పాటు మొత్తంగా 2,26,790 మందికి రూ.67.31 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. రాయచోటి కలెక్టరేట్ స్పందన హాల్లో ఏర్పాటు చేసిన ఈ వర్చువల్ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, మునిసిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పేద ప్రజలను ఆర్థికంగా ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తోందన్నారు. గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా నేరుగా పథకాలను ప్రజల ముంగిటకే అందిస్తోందని చెప్పారు. మునిసిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా మాట్లాడుతూ ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ పింఛన్లు క్రమంగా రూ.3 వేల వరకు పెంచి అవ్వతాతలు, అక్కచెల్లెమ్మలు, అన్నదమ్ములకు ప్రభుత్వం బాసటగా నిలిచిందన్నారు. ప్రభుత్వం చేస్తున్న మేలును ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలని మునిసిపల్ చైర్మన్ పేర్కొన్నారు.

**మెగా చెక్కు అందజేత**

అన్నమయ్య జిల్లాకు సంబంధించిన వైఎస్ఆర్ పెన్షన్ కానుక లబ్ధి రూ.67.31 కోట్ల మెగా చెక్కును జేసీ, మునిసిపల్ చైర్మన్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, పింఛన్ల ఏపీడీ గంగాధర్‌గౌడ్, డీఆర్‌డీఏ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

### సూర్యోదయానికి ముందే పింఛను అందుతుంది



పేద ప్రజల పట్ల ప్రేమ, దయ, ఆప్యాయత కలిగిన ప్రభుత్వం ఇది. సూర్యోదయానికి ముందే మాకు పింఛన్ అందుతోంది. ముఖ్యమంత్రి పరిపాలన దక్షతకు ఇది నిదర్శనం. పేద ప్రజల పక్షాన నిలబడుతున్న ముఖ్యమంత్రికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటాం.

– ఎం.బాలకృష్ణ; మంగళవీధి, రాయచోటి

### అర్హత ప్రామాణికంగా పింఛన్ మంజూరు



వికలాంగుల కోటలో జనవరి నెల నుంచి కొత్తగా నాకు పింఛన్ మంజూరు అయింది. పింఛన్ నిమిత్తం సచివాలయంలో నేను దరఖాస్తు చేసుకోగానే ఎలాంటి సిఫారసులు లేకుండానే అర్హత ప్రామాణికంగా నాకు పింఛన్ మంజూరు అయింది. మావంటి దివ్యాంగులకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. పారదర్శకంగా సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రికి ధన్యవాదాలు.

– కె.లక్ష్మీనారాయణ, కొత్తపేట, రామాపురం

## తప్పుల్లేని ఓటరు జాబితా తయారు చేయాలి

**జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్**

**రాయచోటి :** జిల్లా ఓటరు జాబితాలో ఏమాత్రం తప్పులు లేకుండా తయారు చేసి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులకు సూచించారు. బుధవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా తమ కార్యాలయం నుంచి 2024 సాధారణ ఎన్నికల నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ మాట్లాడుతూ జిల్లాలో తప్పులు లేని ఓటర్ జాబితా తయారు చేసేందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పీఎస్ఈ, డీఎస్ఈ, అంశంలో భాగంగా 7,15,30 రోజులు పైబడిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలన్నారు. పీఎస్ఈ, డీఎస్ఈలు వందశాతం ఫారం-7 జనరేట్ చేయాలన్నారు. ఓటరు గుర్తింపు కార్డులు ఎప్పటికప్పుడు పంపిణీ చేయాలన్నారు. డూప్లికేట్ ఓట్లను ఒకటికి రెండు సార్లు పరిశీలించి ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం తొలగించాలన్నారు. జిల్లాలో దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా వెంటనే క్లియర్ చేయాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ వివిధ అంశాలపై ఎన్నికల విభాగం అధికారులకు సూచనలు ఇచ్చారు.



మాట్లాడుతున్న కలెక్టర్ గిరీషా పీఎస్

## వ్యవసాయానికి 9 గంటల విద్యుత్

**ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ ఎన్‌వీఎస్ సుబ్బరాజు**

**ప్రొద్దుటూరు క్రైం :** వ్యవసాయానికి పగటి పూట నిరంతరాయంగా 9 గంటల పాటు విద్యుత్‌ను అందిస్తున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ (టెక్నికల్) ఎన్‌వీఎస్ సుబ్బరాజు తెలిపారు. ప్రొద్దుటూరులోని కొర్రపాడురోడ్డులో ఉన్న సబ్‌స్టేషన్‌ను ఆయన బుధవారం తనిఖీ చేశారు. అనంతరం డీఈఈ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. పాత బకాయిల వసూలుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి సర్వీసు డబ్బు వసూలు కావాలన్నారు. విద్యుత్ బిల్లులు, లో ఓల్టేజి ఇతర సమస్యల కోసం 1912 నంబర్‌కు కాల్ చేసేలా వినియోగదారుల్లో అవగాహన కల్పించాలని చెప్పారు. ట్రాన్స్‌ఫార్మర్లు ఫెయిల్యూర్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈదురు గాలులు, వర్షాలకు ట్రాన్స్‌ఫార్మర్లు ట్రిప్ కాకుండా చూడాలన్నారు. ఇందుకోసం లైన్ల పక్కన ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని తెలిపారు. ఆర్డీఎస్ఎస్ కింద గ్రామాలకు ప్రత్యేకంగా ఫీడర్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఫీడర్ల కోసం జిల్లా వ్యాప్తంగా రూ. 900 కోట్లు ఖర్చు చేస్తున్నామని వివరించారు. త్వరలో కొత్త సబ్‌స్టేషన్లను కూడా ఏర్పాటు చేయబోతున్నట్లు చెప్పారు. చాలా ప్రాంతాల్లో వీధి లైట్లు పగలే వెలుగుతున్నాయన్నారు. విద్యుత్ చాలా విలువైందని, పగలు వీధిలైట్లు వెలిగితే సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని చెప్పారు. ఎలాంటి సమస్య రాకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వెంటనే రైతులకు వ్యవసాయ మీటర్లను మంజూరు చేయాలన్నారు. రైతుల విషయంలో అలసత్వం వహించరాదన్నారు. కొర్రపాడు రోడ్డులోని సబ్‌స్టేషన్ సిబ్బంది యూనిఫాంలో ఉండటంతో అధికారులను అభినందించారు.

## క్లుప్తంగా

### ఎర్రచందనం దుంగలు స్వాధీనం

సుండుపల్లె (రాయచోటి టౌన్) : సానిపాయి రేంజ్ రాయవరం సెక్షన్ ముడుంపాడు బీట్‌లో మంగళవారం రాత్రి ఆరు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేసినట్లు సానిపాయి రేంజ్ ఆఫీసర్ కె. వీరయ్య తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంగళవారం రాత్రి సానిపాయి రేంజ్ రాయవరం సెక్షన్ ముడుంపాడు బీట్‌లోని స్లోప్ రిజర్వ్ ఫారెస్టులో తనిఖీ నిర్వహిస్తుండగా తమిళనాడు రాష్ట్రానికి చెందిన మణికందన్ అనే నిందితుడు జీజే 01హెచ్ 9361 నంబర్ కారులో 97 కిలలో బరువున్న ఆరు దుంగలతో పట్టుబడినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.దాడుల్లో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రమేష్ బాబు, సిబ్బంది ఏ. అంజనా స్వాతి, బి. లక్ష్మిప్రసన్న, లీలా హరి, ఎం నాగార్జున పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



గోపాల్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న సబ్ డివిజనల్ అధికారి శ్రీనివాసులు

రామాపురం : రాయచోటి రేంజ్ గువ్వలచెరువు బీట్‌లో ప్రొటెక్షన్ వాచర్‌గా పని చేస్తున్న బి.గోపాల్(38) విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా రామాపురం- లక్కిరెడ్డిపల్లె మార్గంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన విషయం తెలిసిందే. మృతుడి కుటుంబాన్ని ఆదుకునేందుకు సబ్ డివిజనల్ అధికారి శ్రీనివాసులు రూ.1.35లక్షలు అందించారు. అనంతరం కుటుంబ సభ్యులను, భార్య, కుమార్తెలను ఓదార్చారు.అధైర్యపడొద్దని అండగా ఉంటామని తెలిపారు.కార్యక్రమంలో రేంజ్ అధికారులు స్ఫూర్తి, రఘు శంకర్, డీఆర్‌ఓ రమేష్, ఇన్‌చార్జి సెక్షన్ అధికారి భరణికుమార్ పాల్గొన్నారు.

# రేణిగుంట వరకు నంద్యాల డెమో!

- ఏడాది తర్వాత ఎట్టకేలకు పొడిగింపు
- రేణిగుంటలో 6న ప్రారంభం
- నంద్యాల, ఉమ్మడి వైఎస్సార్ జిల్లావాసులకు ప్రయోజనం



నంద్యాల-కడప డెమో రైలు

రాజంపేట : ఉదయం నుంచి సాయంత్రం వరకు వృథాగా ఉండే నంద్యాల-కడప మధ్య నడిచే డెమో ప్యాసింజర్ రైలు కడప రైల్వేస్టేషన్‌ను వదలింది. 07284/07285 నంబరుతో నడుస్తున్న డెమోను పొడిగించాలనే ప్రతిపాదనకు ఏడాది తర్వాత బుధవారం రైల్వేశాఖ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన వారు తిరుపతి వైపు వెళ్లేందుకు అనువుగా ఉంటుందనే డెమోను రేణిగుంట వరకు పొడిగించే ప్రతిపాదనను తీసుకొచ్చారు.

■ ఈనెల 6న రేణిగుంటలో నంద్యాల-డెమో రైలు పొడిగింపునకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వనున్నారు. ఈమేరకు రైల్వేశాఖ సన్నద్ధమవుతోంది.వివిధశాఖల అధికారులకు తొలిరోజున విధులు కేటాయింపులు చేశారు.

**ఉదయంపూట తిరుపతికి రైలుసౌకర్యం**

నంద్యాలతోపాటు ఉభయ వైఎస్సార్ జిల్లాలకు చెందిన యాత్రికులు నేరుగా తిరుపతికి వెళ్లేందుకు వీలుగా డెమో నడపాలని అభ్యర్థిస్తున్నారు. వెంకటాద్రి, రాయలసీమ, కోల్హాపూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఉన్నాయి. కానీ ప్యాసింజర్ రైలు ఒక్కటి కూడాలేకపోవడం గమనార్హం. గతంలో స్టీమ్ ఇంజిన్ లోకోలతో రైళ్లు నడిచే కాలంలోనే కడప నుంచి తిరుపతికి ప్యాసింజర్(93,94నంబర్లతో) ఉదయం పూట నడిచేవి. ఇప్పుడే ఆ పరిస్థితి లేదని ప్రయాణికులు వాపోతున్నారు.

■ నంద్యాల-వైఎస్సార్ ఉభయ జిల్లా వాసులు తిరుపతికి వెళ్లేందుకు అనువుగా ఈ డెమో ప్యాసింజర్ రైలు ప్రయోజనకరమని భక్తులు భావిస్తున్నారు. అయితే ఈ రైలును రేణిగుంట వరకే నడిపిస్తున్నారు. కానీ భక్తులతో పాటు నిత్యం విద్యార్థులు, ఉద్యోగులు, అధికారులు విధుల నిర్వహణ నిమిత్తం తిరుపతికి వెళ్లేవారు అధికంగా ఉన్నారు. ఈరైలును తిరుపతి వరకు పొడిగిస్తే ఉపయోగకరంగా ఉంటుందని ఆదిశగా రైల్వేబోర్డు ఆలోచించాలని కోరుతున్నారు.

**పొడిగింపు టైమింగ్స్ ఇలా..**

నంద్యాల-కడప డెమో ప్యాసింజర్ రైలును పొడిగింపు చేసే టైమింగ్స్ ఇలా ఉంటాయని రైల్వేశాఖ ప్రతిపాదనలో తెలియజేసింది. నంద్యాలలో 5.50కు బయలుదేరి కడపకు 9.40కి చేరుకుంటుంది. 9.45కు కడపలో బయలుదేరి రేణిగుంటకు 1.30 గంటలకు చేరుకుంటుంది. రేణిగుంటలో తిరిగి 2.30కు బయలుదేరి కడపకు 5.30గంటలకు చేరుకుంటుంది. నంద్యాలకు 9.30కు డెమో చేరుకునేలా టైమింగ్ ఫిక్స్ చేశారు. స్టాపింగ్‌స్టేషన్ల ఒంటిమిట్ట, నందలూరు, రాజంపేట, ఓబులవారిపల్లె, రైల్వేకోడూరు బాలపల్లెలు ఉన్నాయి.

## ఈశ్వరీదేవి ఆరాధన ఉత్సవాలు ప్రారంభం



కలశోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలోని శ్రీ ఈశ్వరీదేవిమఠంలో అమ్మవారి ఆరాధన గురుపూజ మహోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉదయం ప్రభాత సేవ, పంచామృతాభిషేకం కుంకుమార్చన నిర్వహించారు. జగన్మాత శ్రీ ఈశ్వరీదేవిని ప్రత్యేకంగా అలంకరించారు. మధ్యాహ్నం నివేదన, నీరాజనం, తీర్థప్రసాద వినియోగం చేపట్టారు. సాయంత్రం సూక్త పారాయణం, కుంకుమార్చన చేశారు. రాత్రి కలశోత్సవం, కలశస్థాపన తదితర కార్యక్రమాలను జరిపారు. ఉభయదాతలుగా కడప వీరబోయిన సుబ్బనరసింహులు, లక్ష్మి, గుంటూరుకు చెందిన కోడూరు సాంబశివారావు వ్యవహరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా మఠాధిపతి శ్రీ వీరశివ కుమారస్వామి ఆశీస్సులతో ఈఓ బీవీ జగన్‌మోహన్ రెడ్డి పర్యవేక్షణలో సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

**అమ్మవారికి చీర అందిస్తున్నాం**

ఈశ్వరీదేవి ఆరాధన మహోత్సవాల సందర్భంగా అమ్మవారికి రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఆధ్వర్యంలో చీర, సారె చీరను అందిస్తున్నామని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పావలూరు హనుమంతరావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 5న అమ్మవారు సజీవ సమాధి నిష్ఠ వహించిన రోజున రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన మహిళలు పాల్గొని చీర, సారె ఇవ్వనున్నట్లు తెలిపారు. ఏపీ విశ్వబ్రాహ్మణ సంఘం న్యాయ సలహాదారు, చైర్మన్ గురుప్రసాద్, సీతారామ ఆచార్య, సుధాకర్, ఎంపిటీసీ మనోహరాచారి, మఠం పెద్దాచార్యులు భద్రయ్యాచారి, విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

### సమస్యలు పరిష్కరించాలి

రాయచోటి టౌన్ : ప్రైవేట్ జూనియర్, డిగ్రీ కళాశాల సమస్యలు పరిష్కరించాలని ప్రైవేట్ జూనియర్, డిగ్రీ కలాశాల అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కనుమల గుండారెడ్డి, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ మదన్ మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం రాయచోటిలోని అర్చ విద్యా సంస్థల్లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. 2020-2021 సంవత్సరానికి సంబధించి ఫీజ్ యింబర్స్‌మెంట్ పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని కోరారు.కొన్ని కళాశాలల్లో ఎక్కువ మందిని చేర్చుకుంటున్నారని తద్వారా విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవతున్నాయని తెలిపారు. ఒక కళాశాలలో 400 మందిని మాత్రమే చేర్చుకోవాలని నిబంధనలు ఉన్నా 1000 నుంచి 1200 మంది వరకు చేర్చుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ప్రైవేట్ కళాశాలలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.159 కోట్లు బకాయలు ఉన్నాయని వాటిని త్వరగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర నాయకులు వెంకటరెడ్డి,జయరాం, వైఎస్‌వీప్రసాద్, ఫైనాన్సియల్ సెక్రెటరీ సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్, సుబ్బారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, మనోజ్‌రెడ్డి, రమణరెడ్డి పాల్గొన్నారు.

### క్రీడలతో మానసికోల్లాసం

జిల్లా ఎస్పీ కృష్ణారావు



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ కృష్ణారావు

వీరబల్లె (రాయచోటి టౌన్) : విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని జిల్లా ఎస్పీ కృష్ణారావు అన్నారు. వీరబల్లె మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సమీపంలో కొత్తగా నిర్మించిన మైదానంలో క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ టోర్నీని ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం పొందొచ్చని తెలిపారు. క్రికెట్ టోర్నమెంట్‌ను గాలివీటి రామకృష్ణారెడ్డి జ్ఞాపకార్థం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు లివిన్ డయాగ్నస్టిక్ అధినేత గాలివీటి వివేకానందరెడ్డి తెలిపారు.కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గాలివీటి వీరనాగిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు శివరాంగౌడ్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రఘురామయ్య, ఆర్థోపెడిక్ డాక్టర్ కొండా విశ్వకిరణ్ రెడ్డి, బరోడా బ్యాంక్ రీజినల్ మేనేజర్ అమరనాథరెడ్డి, ఎంపీటీసీ పురుషోత్తం రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కుళాయి రెడ్డి, ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### గల్లంతైన యువకుడి శవం లభ్యం



చెరువులో నుంచి వెలికి తీసిన యువకుడి మృతదేహం

పెద్దతిప్పసముద్రం : స్థానిక హరిజనవాడకు చెందిన గంగాధర్ (23) అనే యువకుడు ఈ నెల 1న చేపలు పట్టేందుకు సమీపంలోనే ఉన్న తిప్పరాయ చెరువుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో గల్లంతయ్యాడు. శవం ఆచూకీ కోసం రెండు రోజుల పాటు అధికారులు గాలించినా ఫలితం లేకపోయింది. ఈ నేపథ్యంలో బుధవారం చెరువులో శవం పైకి తేలడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. సీఐ తమ్మిశెట్టి, మధు,ఎస్‌ఐ రవీంద్ర, తహశీల్దార్ విద్యాసాగర్, ఆర్‌ఐ అనీషా, సర్పంచ్ తమక శంకర్‌లు ఘటనా స్థలానికి చేరుకున్నారు. తమ బిడ్డ మృతిపై ఎవరిపై కూడా ఎలాంటి అనుమానాలు లేవని, ఎలాంటి కేసులు అవసరం లేదన్న మృతుడి కుటుంబ సభ్యుల కోరిక మేరకు శవాన్ని బాధితులకు అప్పగించారు. అనంతరం బరువెక్కిన గుండెలతో యువకుడి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

### బాలిక అదృశ్యం

మదనపల్లె : మైనర్ బాలిక అదృశ్యంపై కేసు నమోదుచేసినట్లు టూటౌన్ ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. పట్టణంలోని మంజునాథకాలనీకి చెందిన ఓ మైనర్ బాలిక(16) ఇంటర్ మొదటిసంవత్సరం చదువుతోంది. మంగళవారం కాలేజీకి వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు పలుచోట్ల గాలించారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.




వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపురేఖలు నాడు-నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. సొంతంగా సెంటు స్థలం కొనే స్థోమత లేక.. అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్న పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

**ఇంటివద్దకే సర్టిఫికెట్లు**



జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా తమ ఇంటివద్దకు సర్టిఫికెట్లు అందాయని మండల పరిధిలోని చాపలహరిజనవాడకు చెందిన వై శంకరయ్య ఆనందం వ్యక్తం చేశారు. గతంలో సర్టిఫికెట్లు కావాలంటే తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వచ్చేది., జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా వలంటీర్లు తమ ఇంటివద్దకే వచ్చి అవసరమైన సర్టిఫికెట్లు అందిస్తున్నారు.

- శంకరయ్య, చాపల హరిజనవాడ, పుల్లంపేట మండలం

**పాఠశాలల రూపురేఖలు మారాయి**



గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్న తర్వాత పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు సమూలంగా మారిపోయాయి. అదనపు గదులు, ప్రహరీ, మరుగుదొడ్ల నిర్మాణాలు, విద్యుత్, తాగునీటి వసతి కల్పించారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారు. నాణ్యమైన పౌష్టికాహారాన్ని మధ్యాహ్నభోజనం కింద అందజేస్తున్నారు. జగనన్న విద్యాకానుక పేరుతో బడి ప్రారంభానికి ముందే పాఠ్యపుస్తకాలు, నాణ్యమైన యూనిఫాం, బూట్లు, బెల్టులు, బ్యాగ్‌లను ఇస్తున్నారు. సీఎం వైస్ జగన్ పాలనలో ప్రభుత్వ బడులు ఎంతో అభివృద్ధి చెందాయి.

-పోకల మధుసూదన్, ఉపాధ్యాయుడు, ప్రభుత్వ పాఠశాల,బాలాజీనగర్, మదనపల్లె.

**అంగన్‌వాడీ కార్యకర్తలు మరియు సహాయకులకు రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి!**

1. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు 11 డిమాండ్లతో 12.12.2023 నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నారు. మంత్రుల బృందం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మరియు ముఖ్య కార్యదర్శి మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ, ఆర్థిక శాఖ వివిధ స్థాయిలలో ప్రభుత్వం అనేక దఫాలుగా చర్చలు చేసిన తరువాత, ప్రభుత్వం కొన్ని డిమాండ్లను అంగీకరించింది, తదనుగుణంగా ప్రభుత్వం GO లను జారీ చేసింది మరియు అందరికీ ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. పెండింగ్‌లో ఉన్న అద్దెలు, కూరగాయలు, పప్పు దినుసులు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ ఖర్చులు మరియు నిర్వహణ ఛార్జీలు విడుదల చేయడం జరిగింది.
   a) అంగన్‌వాడీ హెల్పర్‌ను అంగన్‌వాడీ వర్కర్‌గా పదోన్నతి కల్పించేందుకు వయోపరిమితిని 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచుతూ 20.12.2023 తేదీన జి.ఓ.ఎం.ఎస్.నెం.44 జారీ చేయబడింది.
   b) అంగన్‌వాడీ కార్యకర్తలకు నెలకు ఒకసారి TA/DA మరియు అంగన్‌వాడీ హెల్పర్‌లకు ద్వైమాసిక TA/DA క్లెయిమ్ చేయడానికి మెమో నం.2303564/2023/PROG-I-A1,తే.20.12.2023 జారీ చేయబడింది. ఈ ఆదేశాలు జారీ చేసిన తేదీ నుంచి అమలులోకి వస్తాయి.
   c) అంగన్‌వాడీ వర్కర్లు & హెల్పర్‌ల కొనసాగింపుకు గరిష్ఠ వయోపరిమితిని 62 సంవత్సరాలుగా నిర్ణయించి, సేవా ముగింపు ప్రయోజనం రూ.1,00,000/- మరియు రూ.40,000 అందించడానికి జి.ఓ.ఎం.ఎస్.నెం.47, తేది 20.12.2023 జారీ చేయబడింది.
   d) అద్దెలు (Rs. 66.54 Crs) పరిపాలనా ఖర్చులు (నీరు & విద్యుత్ ఛార్జీలు, చీపుర్లు, ఫినాయిల్ మొదలైనవి) (Rs. 7.81 Crs) మరియు AWCల నిర్వహణ (చిన్న మరమ్మతులు) రూ.6.36 Crs) కోసం బడ్జెట్‌లు విడుదల చేయబడ్డాయి.
2. అంతేకాకుండా 2019 నుండి,
   a) అంగన్‌వాడీ వర్కర్ల జీతాలను రూ.11,500/-లకు, మినీ అంగన్వాడీ జీతాలను రూ.7,000/-కు, అంగన్‌వాడీ హెల్పర్ల జీతాలను రూ.7,000/-కు పెంచింది.
   b) 2013 నుంచి అంగన్‌వాడీల కార్యకర్తలకు, సూపర్‌వైజర్లుగా ప్రమోషన్లు ఇవ్వలేదు. రాష్ట్ర విభజన తర్వాత తొలిసారిగా ప్రమోషన్లు ఇచ్చి 560 గ్రేడ్-2 సూపర్‌వైజర్ పోస్టులను భర్తీ చేయడం జరిగింది.
   c) ఇదే సందర్భంలో ఈ సూపర్‌వైజర్ పోస్టులకు పరీక్షలు రాసేవారి వయోపరిమితిని 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచుతూ వారికి అనుకూల నిర్ణయం తీసుకుంది. దీంతో 9 ఏళ్లుగా ప్రమోషన్ల కోసం ఎదురుచూస్తున్న వారిలో ఎక్కువ మంది పోటీపడే అవకాశాన్ని కల్పించడం జరిగింది.
   d) అన్నింటికంటే ముఖ్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలకు అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులను అర్హులుగా గుర్తించి వారికి డీబీటీ ద్వారా రూ.1,313 కోట్లు అందించడం జరిగింది. నవరత్నాలు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అమలు చేసిన జగనన్న విద్యా దీవెన, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ రైతు భరోసా, జగనన్న వసతి దీవెన, వైఎస్సార్ ఆరోగ్య శ్రీ తదితర పథకాలను వారికి వర్తింప చేస్తోంది.
   e) ఈ ఏడాది నుంచి అంగన్‌వాడీ వర్కర్లకు, హెల్పర్లకు జీవిత బీమాను కూడా వర్తింపు చేస్తోంది. ప్రమాద బీమాగా రూ.2 లక్షల వరకూ చెల్లించడం జరుగుతోంది.
   f) గర్భవతులకు, బాలింతలకు, పిల్లలకు గతంలో మాదిరిగా వండి ఇచ్చే ఇబ్బంది లేకుండా టేక్ హోమ్ రేషన్ పద్ధతిని ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. దీనివల్ల వారికి పనిభారం తగ్గడమే కాకుండా పారదర్శకంగా, నాణ్యమైన సేవలు అందించే మార్గాలను అంగన్‌వాడీలకు అందిస్తూ 2023 నుంచి ప్రభుత్వం డ్రై రేషన్ అందిస్తోంది.
3. జాతీయ ఆహార భద్రతా చట్టం (NFSA), 2013 నిర్దేశించిన విధంగా ప్రతి గర్భిణీ స్త్రీలకు మరియు పాలిచ్చే తల్లికి బిడ్డ పుట్టిన 6 నెలల వరకు మరియు 7 నెలల నుండి 6 సంవత్సరాల వయస్సు గల ప్రతి బిడ్డకు (పౌష్టికాహార లోపంతో బాధపడే వారితో సహా) సప్లిమెంటరీ న్యూట్రిషన్ అందించడం తప్పనిసరి. వారి సంబంధిత అంగన్‌వాడీ సెంటర్లో నమోదు చేసుకున్న లబ్ధిదారులకు అనుబంధ పోషకాహారం అన్ని పనివేళల్లో అందించాలి. ICDS పథకం కింద సప్లిమెంటరీ న్యూట్రిషన్, క్యాలెండర్ సంవత్సరంలో కనీసం 300 లేదా నెలలో సగటున 25 రోజులు అనగా, ఉదయం స్నాక్స్, వేడిగా వండిన భోజనం (HCM) మరియు టేక్ హోమ్ రేషన్‌గా అందించాలి.
4. సప్లిమెంటరీ న్యూట్రిషన్ ప్రోగ్రాం యొక్క లక్ష్యాలు గర్భిణీ స్త్రీలు మరియు పాలిచ్చే తల్లులు, 7 నెలల నుండి 3 సంవత్సరాల పిల్లలకు మరియు 3 సంవత్సరాల నుండి 6 సంవత్సరాల పిల్లలకు నిరంతరం పోషకాహార సహాయాన్ని అందజేయడం. AWWలు & AWHలు సమ్మె వలన వారి విధులకు హాజరు కాకపోవడం వలన, పోషకాహార కిట్‌లు, THR మరియు గుడ్లు & పాలు మరియు పంపిణీ చేయబడిన సప్లిమెంటరీ న్యూట్రిషన్ (SNP) లబ్ధిదారులకు లేదు. అంతేకాకుండా, గర్భిణీలు & పాలిచ్చే తల్లులు & 06 నెలలు-6 సంవత్సరాల పిల్లలను ఆరోగ్య శాఖ ANM సమన్వయంతో అంగన్‌వాడీ కేంద్రంలో వివిధ పెరుగుదల/ఆరోగ్య పారామితులపై పర్యవేక్షణ జరగటం లేదు.
5. పైన పేర్కొన్న అంశాల దృష్ట్యా అంగన్‌వాడీ కేంద్రాలలో అందించే సేవలకు ఆటంకం ఏర్పడినందున, గర్భిణులు & పాలిచ్చే స్త్రీలు, చిన్న పిల్లలు మరియు అణగారిన వర్గాల యొక్క ప్రయోజనాల దృష్ట్యా అంగన్‌వాడీ కేంద్రాలలో అందించే సేవలను కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మరియు ప్రజల ప్రయోజనాల దృష్ట్యా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేయడం జరిగింది.
6. పిల్లలకు మరియు గర్భవతులు మరియు బాలింతలకు ఎలాంటి అంతరాయం లేకుండా పోషకాహారాన్ని అందించటానికి, అంగన్‌వాడీ సెంటర్లను నిర్వహించటానికి ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయడానికి జివిడబ్ల్యువి & విఎస్‌డబ్ల్యుఎస్ (లేదా) సెర్ప్ (లేదా) రెండింటి కలయికతో కూడిన గ్రామ సంస్థల యంత్రాంగాన్ని ఉపయోగించుకుంటున్నాము.
7. క్యాబినెట్ మంత్రుల గ్రూపు, చీఫ్ సెక్రటరీ, ముఖ్య కార్యదర్శి స్థాయి అధికారులు మీతో పలు దఫాలుగా చర్చించి, సమ్మెను విరమించుకోవలసినదిగా విజ్ఞప్తి చేసియున్నారు. డిపార్టుమెంట్ కూడా అందరు అంగన్‌వాడీ కార్యకర్తలు బల్క్ ఎస్.ఎం.ఎస్ ను పంపించి సమ్మెను విరమించుకోవలసినదిగా కోరటం జరిగింది. ప్రస్తుతం 53.7% గర్భవతులు రక్తహీనతతో వున్నారు, 29.6% 5 సంవత్సరాల లోపు పిల్లలు బరువు తక్కువగా వున్నారు, 16.1% 5 సంవత్సరాలలోపు పిల్లలు ఎత్తుకు తగిన బరువు లేకుండా (ఎన్.ఎఫ్.హెచ్.ఎస్-5 ప్రకారంగా) వున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహార పంపిణీలో జరుగుతున్న అంతరాయం వలన వీరి ఆరోగ్య మరియు పోషణ స్థాయిలు దిగజారి హైరిస్క్ గ్రూప్‌లో పడే ప్రమాదం వున్నది. మీరు సమ్మె నోటీసు ఇచ్చి ఉన్నారు. దీన్ని పరిష్కరించుకొని ప్రభుత్వం వారు మీ సంఘము యొక్క సభ్యులతో పలుసార్లు చర్చించి ముఖ్యమైన కోరికలకు ప్రాథమికముగా ఆమోదం తెలిపియున్నారు. ప్రభుత్వం మిగిలిన కోరికలను పరిష్కరించుటకు ప్రయత్నములు చేయుచున్నప్పటికీ, మీరు మీ యొక్క ఉద్యోగ బాధ్యతలను విస్మరించి విధులకు రావటం లేదు. కావున జిల్లా పరిపాలన అధికారిగా మీకు విజ్ఞప్తి చేయడం ఏమనగా మీ న్యాయమైన కోర్కెలన్నీ ప్రభుత్వం పరిష్కరించడానికి కృతనిశ్చయంతో ఉంది. ఇప్పటికే ప్రభుత్వం చాలా డిమాండ్లను పరిష్కరించిందని గుర్తించుకోవలసినదిగా అభ్యర్థిస్తున్నాము. అలాగే ఈ సమ్మె వల్ల బాలింతలు, గర్భిణీ స్త్రీలు, పసిపిల్లలు పౌష్టికాహారం అందక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని సహృదయంతో అర్థం చేసుకోవాలని మనవి చేస్తున్నాము. గర్భవతులు మరియు పిల్లల ఆరోగ్య మరియు పోషణ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సమ్మెను విరమించాలని విజ్ఞప్తి చేస్తున్నాము మరియు జనవరి 5, 2024 లోగా విధులకు హాజరు కావలసినదిగా కోరుచున్నాము. ఒకవేళ సమ్మె విరమింప చేయని యెడల ప్రభుత్వ నియమ నిబంధనల అనుసరించి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలియచేయటమైనది.

ఇట్లు

జిల్లా కలెక్టర్ మరియు మేజిస్ట్రేట్, అన్నమయ్య జిల్లా.

## కురబలకు సముచిత స్థానం కల్పించిన పార్టీకే మద్దతు



మాట్లాడుతున్న కురబసంఘం రాష్ట్ర అధ్యక్షుడు జె.శ్రీనివాసులు

రాయచోటి అర్బన్ : కురబలకు రాజకీయాల్లో సముచిత స్థానం కల్పించిన పార్టీకే తమ మద్దతు ఉంటుందని రాష్ట్ర కురబ, కురుమ, కురవ సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం అన్నమయ్య జిల్లా రాయచోటిలోని అజయ్ రెసిడెన్సీలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ 2009లో పుంగనూరు, పీలేరు నియోజకవర్గాల్లో, 2014లో మదనపల్లెలో ఎమ్మెల్యే టికెట్లు కురబలకు కేటాయిస్తామని టీడీపీ నమ్మించి మోసం చేసిందని చెప్పారు. 2009లో కుప్పం నుంచి 250 మంది కురబ సంఘం నేతలు విజయవాడలో బాబు నిర్వహిస్తున్న ప్రజా దర్బారుకు వెళ్లి అసంపూర్తిగా ఉన్న కురబ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులివ్వాలని కోరగా నిధులు లేవంటూ తమపై ఆగ్రహించారన్నారు. 2019లో అనంతపురంలో నిర్వహించిన కురబ గర్జనలో తమ కులస్తులకు ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లు ఇవ్వాలంటూ చేసిన డిమాండ్‌కు అప్పటి ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందించారన్నారు. తమ కులానికి 2 ఎమ్మెల్యే, 1 ఎంపీ టికెట్లు కేటాయించారని చెప్పారు. 2019లో ఎమ్మెల్సీ భరత్ కుప్పం వై జంక్షన్‌లో కనకదాసు విగ్రహాన్ని సొంత ఖర్చులతో ఏర్పాటు చేశారన్నారు. దీనిని బట్టి వైఎస్ఆర్‌సీపీ నేతలకు కురబలపై ఎంత ప్రేమ ఉందో అర్థం అవుతోందన్నారు. వచ్చే ఎన్నికల్లో కురబలకు రాష్ట్రవ్యాప్తంగా 7ఎమ్మెల్యే, 2 ఎంపీ, 2 ఎమ్మెల్సీ, 2 జెడ్పీ చైర్మన్, 1 మేయర్, మున్సిపల్ చైర్మన్ పదవులతో పాటు 5 నామినేటెడ్ పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కురబసంఘం జిల్లా అధ్యక్షుడు రవిశంకర్ మాట్లాడుతూ రాయచోటిలో కురుబభవన్ కోసం స్థలం కేటాయించాలని, రాయచోటి రింగు రోడ్డులో కనకదాస సర్కిల్‌ను ఏర్పాటు చేసి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో సంఘం నేతలు తరిగొండ ఈశ్వరయ్య, జి.రెడ్డెన్న, ఎం.వెంకటరమణ, సుధాకర్, చంద్రమోహన్, కదిరి చిన్నప్ప, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### మృతుడి ఆచూకీ లభ్యం



ఆసుపత్రిలో ఉన్న అశ్వర్థప్ప మృతదేహం

మదనపల్లె : ఆర్టీసీ బస్టాండులో డిసెంబర్ 31న అనారోగ్య కారణాలతో మృతిచెందిన వ్యక్తి ఆచూకీ లభ్యమైంది. బుధవారం టూటౌన్ పోలీసులు మృతుడి కుటుంబీకులకు సమాచారం అందించగా వారు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి చేరుకుని మృతదేహాన్ని గుర్తించారు. మృతుడు కర్ణాటకలోని చిక్‌బళ్లాపూర్ తాలూకా శ్రీనివాససాగర్‌కు చెందిన నారాయణరెడ్డి కుమారుడు బి.ఎస్.అశ్వర్థప్ప (55) గా పేర్కొన్నారు. మద్యానికి బానిసై ఇంటిలో ఉండకుండా సంచార జీవనం గడిపేవాడన్నారు. నాలుగునెలల క్రితం స్వగ్రామానికి వచ్చి కొంత నగదు తీసుకుని వెళ్లిపోయాడన్నారు. టూటౌన్ పోలీసుల ద్వారా సమాచారం అందడంతో మదనపల్లెకు వచ్చామని కుటుంబసభ్యులు తెలిపారు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించినట్లు ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య చెప్పారు.

### యోగా టీచర్‌పై పోక్సో కేసు

గుత్తి రూరల్ : మండలంలోని ఓ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యోగా ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న పల్లపోతుల అనిల్‌కుమార్‌రెడ్డిపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. వివరాలు...వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు మండలం చౌడూరు గ్రామానికి చెందిన అనిల్‌కుమార్‌రెడ్డి గుత్తి మండలంలోని ఓ జెడ్పీ హెచ్‌ఎస్‌లో యోగా టీచర్‌గా పనిచేస్తున్నాడు. గత డిసెంబర్ 25న తాను పనిచేస్తున్న పాఠశాలలోని పదో తరగతి విద్యార్థినిని మాయమాటలతో లోబర్చుకుని పిలుచుకెళ్లాడు. ఆ సమయంలో ఇంట్లోని ఐదు తులాల బంగారు నగలతో ఆమె వెళ్లిపోయింది. విషయం తెలుసుకున్న విద్యార్థిని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అనిల్‌కుమార్‌రెడ్డి ఉన్న ప్రాంతాన్ని పసిగట్టి మంగళవారం రాత్రి అక్కడకు చేరుకుని ఇద్దరినీ పిలుచుకుని గుత్తికి వచ్చారు. విచారణ తర్వాత బుధవారం రాత్రి బాధితు రాలి ఫిర్యాదు మేరకు అనిల్‌కుమార్‌రెడ్డిపై కి డ్నాప్, పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశారు.

## వేర్వేరు ప్రాంతాల్లో నలుగురి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న సుప్రియ

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో నలుగురు వ్యక్తులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మదనపల్లె మండలం అంకిశెట్టిపల్లెకు చెందిన ఎస్.రియాజ్(25), భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో మనస్తాపం చెంది మంగళవారం రాత్రి ఇంటివద్ద పురుగుమందు తాగాడు. కురబలకోట మండలం అంగళ్లకు చెందిన వెంకటేష్ భార్య కవిత కుటుంబసమస్యలతో విషద్రావణం తాగింది. చింతమాకులపల్లెకు చెందిన మైనర్ బాలిక(18) తల్లిదండ్రులు మందలించారన్న మనస్తాపంతో పురుగుమందు తాగింది. గుర్రంకొండ మండలం మర్రిమాకులపల్లెకు చెందిన కిరణ్‌కుమార్ భార్య సుప్రియ కుటుంబసమస్యలతో పిడుదుల మందు తాగింది. ఆయా ఘటనల్లో బాధితులను కుటుంబసభ్యులు 108 అంబులెన్స్ ద్వారా మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వీరిలో రియాజ్, సుప్రియల పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

# కారు, టాటా ఏస్ ఢీ

ఒకరి మృతి, నలుగురికి తీవ్రగాయాలు



బాలరాజు మృతదేహం వద్ద విలపిస్తున్న భార్య లక్ష్మిదేవి



చికిత్సపొందుతున్న బాలనరసింహులు





నుజ్జునుజ్జయిన కారు, టాటాఏస్

పోరుమామిళ్ల : పోరుమామిళ్లకు 3 కిలోమీటర్ల దూరంలో బద్వేలు రోడ్డులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో పోరుమామిళ్ల మండలం మార్కాపురం దళితవాడకు చెందిన సగిలి బాలరాజు (45) మృతి చెందాడు.పోరుమామిళ్లకు చెందిన బాలనరసింహులు, మహబూబ్‌పీరా, బాషా, దంతెలపల్లెకు చెందిన విజయకుమార్ గాయపడ్డారు. బాలనరసింహులు పరిస్థితి విషమంగా ఉండటంతో కడప రిమ్స్‌కు తరలించారు. పోలీసుల కథనం మేరకు వివరాలు.. పోరుమామిళ్లకు చెందిన పీఎస్ఆర్ సప్లయర్స్‌కు చెందిన షామియానా సామగ్రిని బాలరాజు బి.కోడూరు నుంచి టాటాఏస్‌లో తీసుకొని పోరుమామిళ్లకు బయలుదేరాడు. దంతెలపల్లెకు చెందిన ఆదినారాయణరెడ్డి కారు డ్రైవర్ విజయకుమార్ పోరుమామిళ్ల నుంచి దంతెలపల్లె వెళుతుండగా రెండు వాహనాలు ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. రెండు వాహనాలు నుజ్జు నుజ్జయ్యాయి. ఈ ఘటనలో టాటాఏస్ వాహనం నడుపుతున్న బాలరాజు తీవ్రగాయాలతో మృతి చెందాడు. అందులో ఉన్న మిగతా ముగ్గురు గాయపడ్డారు. కారు నడుపుతున్న విజయకుమార్, టాటాఏస్‌లో ఉన్న మహబూబ్‌పీర్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. కారులో డ్రైవర్ ఒక్కడే ఉన్నాడు. మృతుడు బాలరాజు మార్కాపురం సగిలి శాంతయ్య కుమారుడు. ఇతినికి భార్య లక్ష్మిదేవి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. భర్త మరణాన్ని తట్టుకోలేక లక్ష్మిదేవి కన్నీరుమున్నీరవుతోంది. విషయం తెలియగానే ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రులతో మాట్లాడారు.